తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు | ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి | మహబూబాబాద్ | నిర్మల్ | మంచిర్యాల | కొమురం భీం అసిఫాబాద్
గురువారం
4 ఏప్రిల్ 2024
పేజీలు : 08

# 'ఈజీఎస్' మట్టి ఇటిక బట్టికి..

- కనీస విద్యుత్ మీటర్ కూడా లేదు
- నిత్యం 100 బుగ్గలు వెలుగుతున్నాయి
- బూడిద, పొగతో పంట పొలాలు ధ్వంసం

*మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రంలో ఇటుక దందా ఇష్టారాజ్యంగా జరుగుతుంది. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తూ అధిక సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. పంట పొలాల్లో ఇటుకల బట్టి తయారీ చేస్తూ ఇతర రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇటుక బట్టీ నుంచి వచ్చే బూడిద, పొగతో పక్కనే ఉన్న రహదారి వెంట వెళ్తున్న వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి తయారు చుట్టుపక్కల పంట పొలాలు ఉండడంతో ఇటుక పట్టి నుంచి వెలువడే పొగ బూడిదతో పంటలు ధ్వంసం అవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పట్టా భూమికి కనీసం నాలా కూడా కట్టకుండా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్నారు. అధికారులకు నెలవారిగా ముడుపులు ముట్టడంతో చోద్యం చూస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.*

–పెద్దవంగర, ఏప్రిల్ 03 (జనంసాక్షి) :



స్థానిక గ్రామపంచాయతీ, రెవెన్యూ శాఖ, మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. దీంతోపాటు పట్టా భూమిని నాలాకన్వర్షేషన్ చేసుకొని తయారీకి ఉపయోగించుకోవాలి లివిద్యుత్ విద్యుత్ మీటర్ కూడా లేదులి ఒక్క నెలవారి విద్యుత్ బిల్లు పెండింగ్లో ఉంటే విద్యుత్ అధికారులు వచ్చి మీటర్ కనెక్షన్ తొలగిస్తు న్నారు. కానీ ఇటుకల బట్టిలో సుమారు 100 బుగ్గలు నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. కనీసం విద్యుత్తు మీటర్ కూడా లేదు. చోద్యం చూస్తున్న విద్యుత్ అధికారులు. ఇటుక బట్టీకి అవసరం మాకు మట్టిని ఆయా గ్రామాలలోని చెరువుల కుంటల నుంచి తీసుకొస్తున్నారు. ఉపాధి హామీ కూలీలు తీసిన మట్టి కూడా ఇటుక పట్టికే వెళుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న ఇటుక బట్టి నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రజలకు తగు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# ఈ చేతి పంపు ఎవరికోసం?



నియోజకవర్గ కేంద్రంలోని ప్రధాన దారి పక్కన గల్లీ రోడ్డు మధ్యలో ఉన్న చేతి పంపు ఎవరి కోసం ఏర్పాటు చేశారని స్థానికులు చర్చించుకుంటున్నారు. కొంతకాలంగా పునరుద్ధరణకు నోచుకోని నిరుపయోగంగా ఉన్న ఈ చేతి పంపు కారణంగా పలుమార్లు ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భాలు కూడా లేకపోలేదు. ఈ చేతి పంపు వాహన దారులకు తీవ్ర ఇబ్బందులను గురిచేస్తుంది. ప్రమాదకరంగా ఉన్న ఈ చేతిపంపును తొలగించి ప్రజల సమస్యలను తీర్చాలని పలువురు కోరుతున్నారు.

– ఖానాపూర్ ఏప్రిల్ 03 (జనంసాక్షి)

# మొదటి దశ ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ పూర్తి

- జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారిని ఇలా త్రిపాఠి



**ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 03 (జనంసాక్షి):** పారదర్శకంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి దశ ఈవిఎం యంత్రాల ర్యాండమైజేషన్ పూర్తి చేశామని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారిని ఇలా త్రిపాఠి అన్నారు.బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఐటిడిఏ పిఓ చిత్రామిశ్రా,అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్లతో కలసి జిల్లా ఎన్నికల అధికారిని ఇలా త్రిపాఠి ఈవిఎం యంత్రాల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా ఈవిఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టామని అన్నారు.మన జిల్లాలో ఉన్న ములుగు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 303 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, మన జిల్లాలో 378 బ్యాలెట్ యూనిట్లు, 378 కంట్రోల్ యూనిట్లు,424 వివిప్యాట్ అందుబాటులో ఉన్నాయని అన్నారు. ప్రజల అభీష్టం మేరకు వివిధ పక్షాలకు చెందిన అభ్యర్థులు విజయం సాధిస్తారని,ఈవిఎం యంత్రాల పై అనవసరపు వద్దంతులు, అపోహలు ప్రచారం అవుతున్న నేపథ్యంలో మరింత పారదర్శకత తీసుకోని వచ్చేందుకు ర్యాండమైజేషన్ ప్రక్రియ ఎన్నికల కమిషన్ ప్రారంభించిందని, ఏ ఈవిఎం యంత్రం ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో వెళ్తుందో ఆన్ లైన్ ఎన్నికల కమిషన్ రూపొందించిన సాఫ్ట్ వేర్ మాత్రమే నిర్దేశిస్తుందని అన్నారు.మొదటి ర్యాండమైజేషన్ సంబంధించి హార్డ్ కాపీలు, సాఫ్ట్ కాపీలు రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించామని, నియోజకవర్గ కేంద్రంలో ఉన్న స్ట్రాంగ్ రూం తరలించే సమయంలో రాజకీయ పార్టీల మిగతా 2లో..

# వేసవిలో తాగునీటి సరఫరా సమృద్ధిగా జరిగేలా పటిష్ట చర్యలు

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 3 (జనం సాక్షి) :** జిల్లాలో వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా సమృద్ధిగా నీటి సరఫరా జరిగేలా ప్రణాళిక బద్ధంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్లో బుధవారం అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలసి మండలాల ప్రత్యేక అధికారులు,ఎంపిడిఓ లు,ఎంపివో లు, ఇంజనీరింగ్, సంబంధిత శాఖల అధికారులతో నీటి సరఫరాపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ పక్కా ప్రణాళికతో నీటి ఇబ్బందులను అధిగమించాలని సూచించారు. మిషన్ భగీరథతో పాటు ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధం చేయాలని, వాటికి అవసరమైన మరమ్మతులు చేయాలని కలెక్టర్ సూచించారు. స్థానికంగా ఉన్న నీటివనరులు, బోరు బావులను తక్షణమే మరమ్మతులు చేయించాలన్నారు. జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట మునిసిపాలిటీలు, మండలాల వారీగా తాగునీటి సరఫరా ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లోనూ చివరి నివాస ప్రాంతం వరకు నీరు చేరేలా చూడాలన్నారు. జిల్లాలో తాగునీటి సరఫరా పర్యవేక్షణ నిమిత్తం ప్రభుత్వం రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు బి .గోపి ను నియనించినట్లు తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు, మండల పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు క్షేత్ర స్థాయిలో ప్రతిరోజు పర్యటించి సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. నీటి ఇబ్బందులు రాకుండా పక్కా ప్రణాళికతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమీక్ష లో జెడ్పీ సీఈవో రాంరెడ్డి, డీపీవో కల్పన, డీఆర్డీఓ కౌసల్య దేవి, మండల ప్రత్యేక అధికారులు,పీఆర్ ఈఈ, మిషన్ భగీరథ ఈఈలు, మున్సిపల్ కమిషనర్లు ఆర్.డబ్ల్యూఎస్., పబ్లిక్ హెల్త్ ఈ.ఈలు, పంచాయతీ అధికారులు, ఎంపీవోలు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# జెండా వెంకటాపూర్‌లో దొంగతనం

**బెల్లంపల్లి, ఏప్రిల్ 3, (జనంసాక్షి) :** బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం జెండా వెంకటాపూర్ గ్రామంలో మంగళవారం ఎస్కూరి కుమార్ ఇంట్లో దొంగలు పడి 3 తులాల బంగారం, 10 తులాల వెండి పట్ట గొలుసులు, 20 వేల రూపాయల నగదు ఎత్తుకెళ్లారు. నెన్నెల ఎస్సై కే ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం జెండా వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఎస్కూరి కుమార్ – కృష్ణవేణి దంపతుల బంధువులకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో పరామర్శించడానికి మంగళవారం మంచిర్యాల ఆసుపత్రికి వెళ్లారు. వారు ఇంట్లో లేని సమయంలో గుర్తు తెలియని దొంగలు ఇంట్లో చొరబడి తలుపులు, బీరువా తాళాలు పగులగొట్టి బీరువాలోని 3 తులాల బంగారం, 10 తులాల వెండి పట్ట గొలుసులు, 20 వేల రూపాయల నగదు ఎత్తుకెళ్లారని వివరించారు. బుధవారం బాధితురాలు ఎస్కూరి కృష్ణవేణి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. కాగా సంఘటన స్థలాన్ని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలోద్దీన్ పరిశీలించారు. క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్స్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. దొరికిన ఆధారాలతో దొంగలను పట్టుకుంటామని సీఐ అన్నారు.



# రెండు ట్రాక్టర్లను పట్టుకున్న మైనింగ్ శాఖ



**చెన్నూర్, ఏప్రిల్, 03 (జనం సాక్షి) :** పట్టణంలో మైనింగ్ శాఖ ఎస్ఆర్ఓ వీరమల్ల సాయికిరణ్, హరీష్ నరేష్ లు అక్రమంగా శివలింగాపురం వాగు నుండి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. మంగళవారం రాత్రి శివలింగాపూర్ రోడ్డులోని ఇటుక బట్టి ప్రాంతంలో రెండు ట్రాక్టర్లను మాట వేసి పట్టుకొని తనిఖీ చేయగా అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్లు గుర్తించి టీఎస్ 19 టి ఏ 5988, మరో నంబరు లేని ట్రాక్టర్లను పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పజెప్పడం జరిగిందని అన్నారు. పై అధికారుల సూచనల మేరకు ఇసుకను మైనింగ్ శాఖ అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఎన్నికల దృశ్య వాహనాల తనిఖీలు



**భైంసా, మార్చ్ 2 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా, మంగళవారం రోజు బైంసా పట్టణంలోని బొర్ర గణేష్ చౌరస్తా వద్ద సిఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో వెహికల్ చెకింగ్ చేస్తూ ఉండగా ముగ్గురు వ్యక్తులు చవాన్ రామారావు, సోమవంశీ యోగేష్, కదం కపిల్ అనే వ్యక్తులు బైంసా నుండి ఇతర గ్రామాలకు వెళ్లేటప్పుడు లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో పరిమితికి మించి డబ్బులు తీసుకెళ్లారు. వారి వద్ద నుండి అనాధికారంగా ఉన్నటువంటి 1,57,090 రూపాయలను వాహనాల తనిఖీలు భాగంగా పట్టుకుని తగిన చర్యలు తీసుకుంటామని బైంసా పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు. అతనితోపాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## పిల్లలు సైబర్ నేరాలకు గురికాకుండా

# తల్లిదండ్రులే పర్యవేక్షించాలి

- బావుల్లో,చెరువుల్లో ఈతలు ప్రమాదకరం
- వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ఎస్సై ఎన్.రవి కుమార్

**రేగొండ,ఏప్రిల్03(జనం సాక్షి) :** వేసవి సెలవులకు ఇంటికి వచ్చే పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎన్ రవికుమార్ అన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రుల బాధ్యతను ఎస్సై బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లలు తమ చదువులు ముగించుకొని వేసవి సెలవుల్లో ఇంటికి వచ్చిన తర్వాత పూర్తి భాధ్యత తల్లిదండ్రులపైనే ఉంటుందని గుర్తుచేశారు.పిల్లలకు సెల్ ఫోన్లు ఇవ్వకూడదని,సైబర్ నేరగాళ్లు పంపే లింకులను తెరవడం వల్ల మనకు తెలియకుండానే సైబర్ నేరానికి గురి అవుతామని ఆయన తెలిపారు.మొబైల్ ఫోన్ల వల్ల అసాంఘిక కార్యక్రమాలపాలకు పిల్లలు బానిస అయ్యే ప్రమాదం ఉంది కావున వీలైనంతవరకు వాటికి దూరంగా ఉంచి పుస్తక పఠనం పట్ల ప్రేరేపిస్తూ ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు.

**బావుల్లో,చెరువుల్లో ఈతలు ప్రమాదకరం**

వేసవి సెలవుల్లో ఈత మరణాలు సహజంగానే ఎక్కువ. స్నేహితులతో కలిసి బావులు చెరువులకు ఈతలకు వెళ్లే సమయంలో పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలి. స్థానికంగా ఉండే బావులు చెరువుల లోతు పట్ల పిల్లలకు అవగాహన కల్పించి పొంచి ఉన్న ప్రమాదాలను ముందస్తుగానే నివారించాలని ఆయన కోరారు.



**వడదెబ్బ పట్ల అవగాహన కలిగి ఉండాలి**

మండలంలోని ప్రజలు వ్యవసాయ ఆధారిత జీవనం కొనసాగిస్తారు. కావున వీలైనంతవరకు ఎండ తాకిడి పెరిగేలోపే వ్యవసాయ పనులను ముగించుకొని ఇంటికి రావాలని ఎస్ఐ సూచించారు.పిల్లలు చల్లని ప్రదేశాల్లో ఆటలు ఆడుకునేలా తల్లిదండ్రులు వసతులు కల్పించాలని,ఎండ తాకిడికి శరీరంలో నీటి శాతం తగ్గి శరీరం పొడి పొడిబారి చిన్న పిల్లల్లో వడదెబ్బ ఎక్కువ ప్రభావం చూపుతుంది.అందువల్ల పిల్లలకు ఎప్పటికప్పుడు నీటిని గానీ చల్ల,నిమ్మరసం త్రాగిస్తూ ఉండాలన్నారు.

# అనుమతులు లేని వాటర్ ప్లాంట్ లకు పెనాల్టీ

- 4 వాటర్ ప్లాంట్ లకు రూ.80 వేల జరిమానా



**వరంగల్ ఈస్ట్, ఏప్రిల్ 03 (జనం సాక్షి) :** నిబంధనలకు విరుద్ధం గా ఎలాంటి అనుమతులు లేకుండా నగరం లో నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్ ల పై బల్దియా శానిటేషన్ అధికారులు కొరడా ఝులిపించారు.బుధవారం బల్దియా పరిధి లోని సుమారు 50 వాటర్ ప్లాంట్‌లలో ముఖ్య ఆరోగ్యాధికారి డా.రాజేష్ నేతృత్వం లో తనిఖీలు నిర్వహించి నీటి స్వచ్ఛత ప్రమాణాలు పాటించని ప్లాంట్ లు, అనుమతులు లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న, ల్యాబ్ నివేదికలను సక్రమం గా నిర్వహించ నందుకు నోటీసులు జారీ చేసినట్లు ముఖ్య ఆరోగ్యాధికారి తెలిపారు.ఈ సందర్భం గా నగర పరిధి లోని గోకుల్ నగర్, ఇందిరా నగర్ గోపాల్‌పూర్ ప్రాంతాల్లోని 4 వాటర్ ప్లాంట్‌లను సందర్శించిన నేపథ్యం లో నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్‌లకు కమీషనర్ ఆదేశాల మేరకు రూ.80,000/– జరిమానా విధించి నోటీసులు జారీ చేయడం జరిగిందని, నోటీసులు స్వీకరించిన వాటర్ ప్లాంట్ నిర్వాహకులు 7 రోజుల్లో అనుమతులు పొందాల్సి ఉంటుందని, అనుమతులు పొందని వాటర్ ప్లాంట్‌లపై చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టడం తో పాటు అట్టి ప్లాంట్ లను మూసి వేయడం (సీజ్) జరుగుతుందని సి ఎం హెచ్ ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ లు అనిల్ గోల్కొండ శ్రీను జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

- డిఆర్డిఓ శ్రీనివాసరావు

**భీమదేవరపల్లి ఏప్రిల్ 03 (జనం సాక్షి) :** మండలంలోని వంగర పిహెచ్సిని హనుమకొండ జిల్లా అడిషనల్ డి.ఆర్.డి.ఓ శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. వేసవిలో ఎండల తీవ్రత దృష్ట్యా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. వంగర వైద్య సిబ్బంది అందిస్తున్న సేవల గురించి హర్షం వ్యక్తంచేశారు. అన్ని గ్రామాల్లో ఆశ ఎఎన్ఎం ల వద్ద ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్స్ ప్రజలకి అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ప్రవీణ్, ఎంపీడీవో వీరేశం, డాక్టర్ రెహమాన్, డాక్టర్ రుబీనా, కే.ఎల్.ఎన్ స్వామి, ఆరోగ్య విస్తరణ అధికారి సుజన, మౌనిక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# పరామర్శ



**టేకుమట్ల, ఏప్రిల్ 03 (జనంసాక్షి) :** మండల కేంద్రానికి చెందిన మియాపురం లక్ష్మీబాయి, ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు.దీంతో బుధవారం బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యాన్ని అందించారు.ఆయన వెంట యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు పెరుమాండ్ల క్రాంతి,యూత్ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు కోలుగురి అనిల్,బాలయ్య, తదితరులు ఉన్నారు.

# మొదటి దశ ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ పూర్తి

ప్రతినిధుల సమక్షంలో చేస్తామని అన్నారు.ఈ సమావేశంలో స్థానిక ఎమ్మార్వో విజయ భాస్కర్, తాడ్వాయి ఎమ్మార్వో రవీందర్,ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ విజయ్,అనీస్ ఫాతిమా,ఎన్నికల సిబ్బంది వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 03 (జనంసాక్షి):** జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారిణి,జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలలో పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాలలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు చేయవలసిన విధులపై మాస్టర్ ట్రైనర్స్ చే నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటిడిఏ పిఓ చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ,సిహెచ్ మహేందర్ జి లతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ పోలింగ్ అధికారులకు ముఖ్యంగా ఈవీఎం యంత్రాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని,మాక్ పోల్ నిర్వహణ, ఈవిఎం యంత్రాల పని తీరు,బాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్ల కనెక్షన్లు, వాటి పని తీరు,మరమ్మత్తు జరిగితే తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు.వివి ప్యాట్లు ప్రజలకు మరింత భరోసా కలిగించేందుకు భారత ఎన్నికల కమిషన్ 2017 నుంచి వాడకలోకి తీసుకుని వచ్చిందని, ఈవిఎం యంత్రాలకు వివి ప్యాట్ల కనెక్షన్ పకడ్బందీగా చేయాలని, పోలింగ్ కేంద్రంలో ఈవీఎంత్రాలను పోలింగ్ కంపార్ట్మెంట్ ఏర్పాటు ఉండేలా చూసుకోవాలని అన్నారు.ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల కమీషన్ నిర్దేశించిన నియమ, నిబంధనలపై అధికారులకు సంపూర్ణ అవగాహన ఉండటం చాలా కీలకమని, ముఖ్యమైన నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉంటే నమ్మకంతో పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించవచ్చని కలెక్టర్ అన్నారు. మొదటి రోజు 450 మంది హాజరు కావాల్సి ఉండగా, 437 మంది హాజరు అయ్యారని మొదటి రోజు హాజరు కానీ 13 మంది రెండో రోజు గురువారం శిక్షణ కార్యక్రమాల్లో తప్పక పాల్గొనాలని లేని యెడల చర్యలు తీసుకోబడునని కలెక్టర్ సూచించారు.ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా మాట్లాడుతూ, ప్రణాళికాబద్ధంగా ఎన్నికలు నిర్వహించుట కోసం ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలపై అవగాహన కల్పించుకొని వాటికి అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఈఓ పాణిని,తహసిల్దార్లు విజయ భాస్కర్,రవీందర్, ట్రైనింగ్ నోడల్ అధికారి జయదేవ్, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్స్, ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే గండ్ర



**చిట్యాల, ఏప్రిల్ 3 (జనంసాక్షి) :** మండల కేంద్రం వెంకట్రా వుపల్లి (సి) గ్రామ వాస్తవ్యులు కొక్కుల రామ రమేష్ కుమారుడు రాకేష్ వెడ్స్ పూజిత వివాహ వేడుకకు బుధవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో జీవించాలని నూతన దంపతులను ఆశీర్వదించారు. వారి వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షులు గూట్ల తిరుపతి, కొక్కుల సదానందం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ తల్లి వేడుకలు



**చిట్యాల, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో బుధవారం ఘనంగా పోచమ్మ బోనాలు కన్నుల పండుగల నిర్వహిం చారు. మండల కేంద్రం చింతలపల్లి లోని పోచమ్మ ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. పిల్లాపాపలు, పాడిపంటలు సమృద్ధిగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**చిట్యాల ఏప్రిల్ 3( జనంసాక్షి) :** మానేరు వాగు నుంచి అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ను పట్టుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి శ్రావణ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జడల్ పేట గ్రామ శివారులో ఏ ఎస్ ఐ ఈశ్వరయ్య, కానిస్టేబుల్స్ వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మండలంలోని అందుకు తండా గ్రామానికి చెందిన చిలుముల రమేష్ లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి శ్రావణ్ పేర్కొన్నారు.

## గుత్తి కోయ గిరిజనులకు ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన కల్పించాలి

● జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 03 (జనంసాక్షి):** గుత్తి కోయ గిరిజనులకు ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ములుగు సామాజిక ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వెంకటాపూర్ మండలం పరిధిలోని తొర్రిచింతలపాడు గుత్తి కోయ గ్రామానికి చెందిన ఇద్దరి కవలలకు జన్మనిచ్చిన గుత్తి కోయ బాలింత మహిళకు ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు,ఆరోగ్యం పరిస్థితిని కలెక్టర్ స్వయంగా మహిళను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గుత్తి కోయ గిరిజన గ్రామాల లో మహిళలకు రెవిన్యూ , పోలీస్, వైద్యాధికారుల సమన్వ యంతో ప్రత్యేక అవగా హన కార్యక్రమాలు కల్పించాలని సూచించారు. మహిళలు ప్రెగ్నెన్సీ విషయంలో జాగ్రత్త పాటించాలని సొంత వైద్యంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో చికిత్స చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అలెం అప్పయ్య, సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి డాక్టర్ జగదీష్,తదితరులు పాల్గొన్నారు.

## పీఏసిఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 03, (జనం సాక్షి) :** మండలంలోని సముద్రాల, రంగరా యుగూడెం, ఇప్పగూడెం, చిల్పూర్ మండలంలోని పల్లగుట్ట, కృష్ణాజిగూడెం, పతేపూర్ గ్రామాలలో పీఏసిఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీఈఓ మొహమ్మద్ మగ్దుం అలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రైవేటు కాంటాల వద్ద అమ్ముకోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద అమ్ముకోవడం ద్వారా మద్దతు ధర లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ సిబ్బంది సింగపురం రాజు, మాటూరి రాంప్ర సాద్,పిఏసిఎస్ సెంటర్ ఇంచార్జ్ లు,రైతులు తదితరు లు పాల్గొన్నారు.

## తోటిమిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**చిట్యాల ఏప్రిల్ 3 (జనంసాక్షి) :** మండలంలోని జడల్ పేట గ్రామపంచాయతీ పరిధి గాంధీ నగర్ లో ఇటీవల రోడ్డు ప్రమాదంలో బొట్ల రమేష్ మృతి చెందాడు. బుధవారం జనగామ గురుకుల ఇంటర్మీడియట్ 2008–2010 మిత్రబృందం, ఆ కుటుంబాన్ని కలిసి పరామర్శించి రూ20,500 ఆర్థిక సాయం అందజేసి రానున్న రోజుల్లో మీ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఇంటర్మీడియట్ మిత్ర బృందం భరోసానిచ్చారు.

## అంగన్వాడీలకు గ్రోత్ మీద శిక్షణ



**స్టేషన్ ఘన్పూర్, ఏప్రిల్ 03 , (జనం సాక్షి ) :** డివిజన్ కేంద్రంలోని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్లో సిడిపిఓ ఫ్లోరెన్సీ ఆధ్వర్యంలో సూపర్వైజర్ లు కె సంధ్యారాణి,కె దివ్య గ్రోత్ మీద శిక్షణఇవ్వడం జరిగిం ది. ప్రతి అంగన్వాడీ సెంటర్ లో ఎత్తు కొలవడానికి 2 సం నుండి 5 సం వరకు స్టాడియో మీటర్ ను ఉపయో గించాలని, 2 సంవత్సరాల లోపు పిల్లలను ఇన్ఫంటో మీటర్ 0 నుండి 5 సంవత్సరాల బరువు తీయడానికి సాల్టర్ స్కేల్ గర్భిణీ బాలింతల బరువులు తీయడాని కి అనాలాగ్ స్కేల్ ఉపయోగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూఓ జయంతి, సిడిపిఓ ఫ్లోరెన్సీ, డాక్టర్ జనార్ధన్ రెడ్డి , అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ సీటు సాధించిన విద్యార్థిని అభినందించిన ఎస్ఐ

**టేకుమట్ల, ఏప్రిల్ 03 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న జె ష్యామ్ నవోదయ స్కూల్ కి ఎంపికైన సందర్భంగా స్థానిక ఎస్సై ప్రసాద్ అభినందించారు.ఈ సందర్భంగా ఎస్ఐ ప్రసాద్ మాట్లాడుతూ ఆదివారం విడుదలైన నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో సీటు సాధించడమే కాకుండా, ఇటీవల విడుదలైన సైనిక్ ప్రవేశాలలో సైతం ఎంపికవ్వడం ఆ విద్యార్థి యొక్క పట్టుదలకి, ఉపాధ్యాయుల కృషికి నిదర్శనం అన్నారు.విద్యార్థి యొక్క విజయాలకు కారణమైనటువంటి శాంతినికేతన్ పాఠశాల భవిష్యత్తులో ఎంతో మంది విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందిస్తూ ముందుకు సాగాలని యాజమాన్యాన్ని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మియాపూర్ హరీష్ కుమార్ పోలీస్ స్టేషన్ సిబ్బంది మధుకర్ రంజిత స్వప్న రాజయ్య గంగరాజు పాల్గొన్నారు.

## మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మారపాక రవి



**స్టేషన్ ఘన్పూర్, ఏప్రిల్ 03, (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని శివుని పెల్లి గ్రామంలో గుర్రం ఏసు బాబు తండ్రి గుర్రం చంద్రయ్య మృతి చెందడం జరిగిం ది. విషయం తెలుసుకున్న జడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ , స్టేషన్ ఘన్పూర్ జడ్పిటిసి మారపాక రవి అక్కడకు చేరుకొని చంద్రయ్య మృతదేహంపై పూల మాలవేసి నివాళులుఅర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించి న వారిలో జెడ్ పి స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవితోపాటు నాయకులు డాక్టర్ లక్కాకుల జగన్, డాక్టర్ కుమార్,గుర్రం శంకర్,గుర్రం శ్రీనివాసు తదితరు లు పాల్గొన్నారు.

## యాదాద్రి భువనగిరి గడ్డపై మూడు రంగుల జెండా ఎగరవేస్తాం జంగిటి విద్యనాథ్



**బచ్చన్నపేట ఏప్రిల్ 3 ( జనం సాక్షి)** వచ్చే పార్ల మెంటు ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకొని భువనగిరి పార్ల మెం టు గడ్డపై మళ్లీ కాంగ్రెస్ పార్టీ మూడు రంగుల జెండా ఎగరవేస్తామని బచ్చన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగిటి విద్యానాథ్ అన్నారు. బుధవారం ఆ యన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వ ఏర్పడ్డ తరువాత ఆరు గ్యారెం టీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇది ప్రజా ప్రభుత్వం అనిపిం చుకున్నదని అన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి నాయ కుడు ప్రతి కార్యకర్త ప్రజలకు తెలియపరుస్తూ వచ్చే పార్లమెంటు ఎన్నికలలో భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డిని జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నియోజకవర్గ ఇన్చార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి నాయకత్వంలో జనగామ నియోజకవర్గం నుండి భారీ మెజార్టీతో గెలిపించి మళ్లీ భువనగిరి పార్లమెంటు గడ్డపై కాంగ్రెస్ పార్టీ మూడు రంగుల జెండా ఎగరవేస్తామని తెలిపారు

## కాంగ్రెస్ లో చేరనున్న పలువురు నాయకులు



**వరంగల్ ఈస్ట్, ఏప్రిల్ 03 (జనం సాక్షి)** వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన పలు వురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమ య్యా రు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్సీ కొండ మురళీధర్ రావును బుధ వారం కలిశారు. ఈ క్రమంలో కొండా దంపతుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్న మాజీ ఎమ్మెల్యే దోనపూడి రమేష్ బాబు, మాజీ కూడా చైర్మన్ హరిహర ప్రసాద్, మూగ రామ్మోహన్రావు మాజీ గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ పోలా నటరాజ్ చేరనున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి వరంగల్ తూర్పు నియోజకవర్గం లో మరింత బలం చేకూరానుంది.

## నవోదయ సిటుసాధించిన విశ్వదీప్తి పాఠశాల విద్యార్థిని



**మల్హర్, ఏప్రిల్ 03(జనంసాక్షి)**మండల పరది లోని కొయ్యూరు గ్రామం లోని విశ్వదీప్తి ప్రయివేట్ స్కూల్ లో చదువు చున్న ఎడ్లపల్లి గ్రామానికి చెందిన దేవునూరి వెంకటేశ్వర్లు కుమార్తె అక్షయ జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష రాయగా అత్యధిక మార్కుల తో సిటు సాధించిన సందర్భంగా విశ్వదీప్తి పాఠశాల కరస్పాడెంట్ ఎం కె సుదర్శన్ ఆ విద్యార్థి కీ అభినందనలు తెలుపుచూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఆర్ ఆర్ తోట బొడ్రాయి ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ



**వరంగల్ ఈస్ట్, ఏప్రిల్ 03 (జనం సాక్షి)** వరంగల్ తూ ర్పు నియోజ కవర్గం లోని సిరంగి రాజా రాం తోట లో ప్రతిష్టించబోయే బొడ్రాయి ప్రతిష్టాపన మహెూత్సవానికి సిర ంగి రాజారాం తోట బొడ్రాయి కమిటీ వారి ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ అటవీ పర్యావరణ శాఖ కొండ సురేఖ హాజరైనారు ఎంతో కష్టపడి ఏర్పాటు చేయడం పై కొండా సురేఖ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి దుష్టశక్తులు రాకుండా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని బొడ్రాయి ప్రతిష్టాపన చేసుకోవడం జరుగుతుందని బొడ్రాయి కమిటీ సభ్యులందరినీ మంత్రి మనస్ఫూర్తిగా అభినందించారు ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది స్థానిక ప్రజలను ఉద్దేశించి మంత్రి ప్రసంగించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో 32వ. డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి 33వ డివిజన్ కార్పొరేటర్ ముష్కమల్ల అరుణ సుధాకర్ అదేవిధంగా బొడ్రాయి కమిటీ అధ్యక్షులు తాటిపాముల బిక్షపతి, బొడ్రాయి కమిటీ ప్రధాన కార్యదర్శి చిలువేరు రవీందర్, పరదేశి రాజేష్, బండారి పూర్ణచందర్, హరికృష్ణ, కొండ సుధాకర్, చిలువేరు రాజేందర్, ఊరుగొండ సతీష్ ,బండి కుమారస్వామి కత్తెరసాల వేణుగోపాల్, బెజ్జాల శ్రవణ్, ఆదెపు జగన్, బైరి ప్రతాప్, వల్పదాస్ మధు పాల్గొన్నారు

## భారత రాజ్యాంగం జోలికి వస్తే ఊరుకునేది లేదు



**టేకుమట్ల.ఏప్రిల్03(జనంసాక్షి)** భారతరత్న రాజ్యాంగ ని ర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యా ంగం జోలికి వస్తే ఊరుకునేది లేదని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య అన్నారు .బుధవారం టేకుమట్ల మండల కేంద్రంలో అంబేద్కర్ యు వజన సంఘం మండల అధ్యక్షులు ఆరకొండ రాజయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి పుల్ల మల్లయ్య హాజరై మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు భారత రాజ్యాంగం ద్వారా 75 సంవత్సరాలుగా పరిపాలన కొన సాగించి నేడు 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారు స్తానని బిజెపి ప్రభుత్వం అన్న మాటలను విరమించుకోవాలని అన్నారు .దేశంలో అధికారం ఉన్నట్టు ప్రభుత్వం అక్రమంగా గెలవడం కోసం మనువాద సిద్ధాంతాన్ని ముందుకు తీసుకోస్తుఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ క్రిస్టియన్ల పైన అనేక దాడులు చేస్తా ఉంది.హిందూ ముస్లిం అంటూ రామ మందిరం నిర్మాణం పేరుతో వైరుధ్యాలు సృష్టిస్తుంది .మను వాదాన్ని తీసుకు వస్తే బానిసత్వం మొదలవుతుందని అన్నారు.ఒకే మ తం పేరాట ప్రచారం చేస్తూ మళ్ళీ అధికారం రావడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తూ ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వాన్ని చిత్తుచిత్తుగా ఓడిం చాలని భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ఈ దేశంలో ఉన్నట ువంటి ప్రజలంతా చైతన్యమై అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కుతో బుద్ధి చెప్పాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారేపల్లి టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య, జిల్లా సహాయ కార్యదర్శి మారపల్లి కొమురయ్య, సి పిఐఎం ఎల్ జి ల్లాకమిటీసభ్యులుసంగిరాజు,అరకొండరాకేష్,తదితరులుపాల్గొన్నారు..

## ఆరూరి రమేష్ ను గెలిపించే బాధ్యత మనందరిపై ఉంది



### బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి

**చిట్యాల, ఏప్రిల్ 03 (జనంసాక్షి)**ఆరూరి రమేష్ ను ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బీజేపీ భూపా లపల్లి నియోజకవర్గ ఇంచార్జి, రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి పిలుపునిచ్చారు.బుధవారం మండలంలోని జూకల్ బిఎన్ ఆర్ ఫంక్షన్ హాల్ లో చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. బిజెపి జిల్లా అధ్య క్షుడు ఏడునూతల నిశీధర్ రెడ్డి ఆధ్వర్యంలో, చిట్యాల మండ లాధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బిజెపి పార్లమెంట్ ప్రబారి మురళీధర్ గౌడ్, భూపా లపల్లి నియోజకవర్గ ఇంచార్జి, రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలని కోరారు. ప్రధానమంత్రి దేశ అభివృద్ధి, సంరక్షణ కోసం నిరంతరం విరామం లేకుండా శ్రమిస్తూ భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలబెట్టారని అన్నారు. నరే ంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చూసి కమలం పువ్వు గుర్తుకు ఓటేసి, మళ్లీ నరేంద్ర మోడీని ప్రధాన మంత్రి చేయాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడుపై ఉన్నదని, కార్యకర్తలు ఒక సైనికుల్లాగా పనిచేసి భారీ మెజార్టీతో బీజేపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ వైస్ చైర్మన్ నాగపూర్ రాజమౌళి గౌడ్, పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపెల్లి కుమారస్వామి గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నంపల్లి పాపన్న, చదువు రామచంద్ర రెడ్డి, కన్నం యగదీశ్వర్, పార్లమెంట్ కో కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్ రావు, అసెంబ్లీ కన్వీనర్ మోర్ రవీందర్ రెడ్డి, టేకుమట్ల మండల అధ్యక్షులు గోపాల్, మొగుళ్లపల్లి మండల అధ్యక్షులు చెవ్వ శేషగిరి, మండల ప్రధాన కార్యదర్శులు మాచర్ల రఘు, శ్రీపెల్లి అనిల్, కామిడీ నారాయణరెడ్డి, సుద్దాల వెంకన్న, శ్రీనివాస్ గౌడ్, మహిళా మోర్చ నాయకులు ఉడుత వనక్క, సింధు, సింధూజ, గజనాల రవీందర్, వల్లాల ప్రవీణ్, రాయిని శ్రీనివాస్, జిల్లా, మండల నాయకులు బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇంచార్జీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల రుణాలు పక్కదారి వడ్డీ రేట్ల మోత



**బిచ్కుంద ఏప్రిల్ (జనంసాక్షి)**మహిళా సాధికారత కోసం స్వశక్తి మహిళా సంఘాలకు ప్రభుత్వం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా అనేక రకాల రుణసదుపాయం కల్పిస్తోంది. బ్యాం కు లింకేజీ ద్వారా పొదుపు సంఘానికి మంజూరయ్యే రుణాల నుం చి వడ్డీ లేకుండా సభ్యులు రుణాన్ని తీసుకోవచ్చు. ఆ పొదుపు సం ఘం పరిధిలోని మండల, గ్రామ సమాఖ్య పొదుపులో నుంచి, పట్టణ సమాఖ్య నుంచి, శ్రీనిధి బ్యాంకు నుంచి, సెప్ ద్వారా రుణాలను పొందే అవకాశం కల్పించింది. స్వశక్తి మహిళా పొదుపు సంఘాల్లో తీసుకున్న వివిధ రకాల రుణాలను సద్వినియోగం చేసుకొని తిరిగి ఆయా అప్పులను చెల్లిస్తూ ఎంతో మంది స్వయం ఉపాధి పొందడమే కాకుండా మరికొంత మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధికల్పిస్తున్నారు. వడ్డీలేని రుణాలు ఏమోకానీ కాస్త వడ్డీతో కూడిన రుణాలు సదరు అధికారులు మంజూరు చేయక పోవడంతో మహిళలు నిరాశకు గురవుతున్నారు. రుణాలను పొంద ేందుకు రూపొందించిన నిబంధనల్లోని కొన్ని లొసుగులు, రుణాలపై సభ్యులకు సంపూర్ణ అవగాహన లేకపోవడం కారణాలతో కొంత మంది రిసోర్స్ పర్సన్లు (ఆర్పీలు), కొన్ని సంఘాల ఆర్గనైజర్లు నిధు లను దారి మళ్లిస్తూ స్వప్రయోజనాలకు వినియోగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహిళలకు రుణాలు కావాలంటే నానా కష్టాలు ఎదురవుతున్నాయి. సమయానికి సంఘాలలో డబ్బులు లభించక పోవడంతో బయట వడ్డీలకు తీసుకొని మరింత అప్పుల పాలవు తున్నారు. క్షేత్రస్థాయిలో మహిళలు తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకుంటున్నారా, అప్పులు తిరిగి చెల్లిస్తున్నారా, నిబంధనల మేరకు సంఘాలను నిర్వహిస్తున్నారా వాటిని పరిశీలించేందుకు కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీవో), వారిపై టీఎంసీ, ఏడీఎంసీ, డీఎంసీ, వారందరిపై ప్రాజెక్టు డైరెక్టర్ ఉన్నారు. వారందరికీ మహిళా సమాఖ్యలతోపాటు అదనపు సంక్షేమ పథకాల బాధ్యతలను కూడా అప్పగిస్తున్నారు. దీంతో సరైన పర్యవేక్షణ ఉండడం లేదు. పొదుపు సంఘాల్లో జరుగుతున్న గందరగోళంతో చాలా మంది మహిళలు ఇబ్బందులు పడటమే కాకుండా కొంత మంది సంఘాల నుంచి వెళ్లిపోతున్నారు. మరికొన్ని సంఘాలను రద్దు చేసుకుంటున్నారు. అధికారులు ఇప్పటికైనా తిరిగి ఇలాంటి అవకతవకలు జరుగకుండా చూడాలని, రుణాల మంజూరు, వసూళ్లపై సమగ్ర విచారణ జరిపి సభ్యులపై భారం పడకుండా చూడాలని కోరుతున్నారు.

# గుడ్ టచ్, బాడ్ టచ్ పై అవగాహన కలిగి ఉండాలి

## షీ టీం ఎస్సై కంచి విద్యాసాగర్




**వరంగల్ ఈస్ట్, ఏప్రిల్ 3 (జనం సాక్షి)** నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని వరంగల్ షీ టీమ్ సబ్ -ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కంచి విద్యాసాగర్ అన్నారు. బుధవారం హన్మకొండ జిల్లా చైతన్య డీమూడ్ టూ బి యూనివర్సిటీ లో హన్మకొండ విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఈవ్ టీజింగ్ మరియు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మరియు సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ1930 కి పిర్యాదు చేయాలి. అన్నోన్ నెంబర్స్ నుండి మహిళలకు ఎవరి నుండైన ఇబ్బందులుకు గురైనప్పుడు, ఎవరైనా మహిళలపై అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లైతే ధైర్యంగా షీ టీమ్ వారికి సమాచారం ఇవ్వాలని,మా షీ టీమ్ మొబైల్ నంబర్స్ సి. పి. వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్. ఐ. వాట్సాప్ నెంబర్ 87126 85270 కి పిర్యాదు చేసిన వివరాలను గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి చర్య తీసుకుంటామని అన్నారు. విద్యార్థులు సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తో పంచుకోవాలని, అలా పంచుకోవడం ద్వారా నేరాలను ప్రాథమిక దశలో నివారించవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చైత్యన డిమూడ్ టూ బి యూనివర్సిటీ కాలేజి డైరెక్టర్ డాక్టర్ పురుషోత్తమ రెడ్డి , డాక్టర్ దామోదర్ రిజిస్ట్రార్ డాక్టర్ రవీందర్, కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కవిత యూనివర్సిటీ ఫ్యాకల్టీ ,డాక్టర్ దేవ్ కుమార్,డాక్టర్ పి.ఓంకార్ శ్రీపాల్, కవిత , షీ టీమ్ నుండి హెడ్ కానిస్టేబుల్ ,బి. సూర్యనారాయణ,కానిస్టేబుల్ ఎన్. రాంరెడ్డి తదితరులు హాజరైనారు.

# పశువుల ఆసుపత్రికీ తలుపులు లేవు



**మల్హర్, ఏప్రిల్ 03(జనంసాక్షి)** మండల కేంద్ర పరది లోని మల్లారం గ్రామం లో ఉన్న పశువుల ఆసుపత్రి భవనం పరిస్థితి ఇది. పేరుకే పశువుల ధవాఖానా కాని దానికి తలుపులు లేవు, అంత చెత్త, పిచ్చి చెట్లతో ఆధ్వణంగా ఉంది. పశువుల ఆసుపత్రి కీ తలుపులు విరిపోవడంతో అ సాంఘిక కార్యక్రమాలకు అడ్డా గా మరే ప్రమాదం ఉంది?పేరుకు మాత్రమే పశువుల హాస్పిటల్ దానిలో పశువుల వైద్యం అందని ద్రాక్ష నే అని స్థానికులు ఆరోపించారు. ఇప్పటికి ఐనా ఉన్నత అధికారులు భవనానికి తలుపులు, పెట్టించాలి అని స్థానికులు కోరుచున్నారు.

# ఎండలు మండుతున్నాయి వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండిసేవలను అందించాలి



**భీమదేవరపల్లి ఏప్రిల్ 03 (జనం సాక్షి)** మండలంలోని వంగర పిహెచ్సిని హనుమకొండ జిల్లా అడిషనల్ డి.ఆర్.డి.ఓ శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. వేసవిలో ఎండల తీవ్రత దృష్ట్యా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. వంగర వైద్య సిబ్బంది అందిస్తున్న సేవల గురించి హర్షం వ్యక్తంచేశారు. అన్ని గ్రామాల్లో ఆశ ఏఎన్ఎం ల వద్ద ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్స్ ప్రజలకి అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ప్రవీణ్, ఎంపీడీవో వీరేశం, డాక్టర్ రెహమాన్, డాక్టర్ రుబీనా, కే.ఎల్.ఎన్ స్వామి, ఆరోగ్య విస్తరణ అధికారి సుజన, మౌనిక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణా కార్యక్రమాలకు షెడ్యూల్ ఖరారు

## ఎన్నికల సిబ్బంది తప్పకుండా హాజరు కావాలి

## జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** శిక్షణా కార్యక్రమాలకు షెడ్యూల్ ఖరారైందని ఎన్నికల సిబ్బంది తప్పకుండా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా కోరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమావేశపు హాలులో బుధవారం పీఓ, ఏపీవోలకు శిక్షణా కార్యక్రమంపై సిబ్బంది మేనేజ్మెంట్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు, సిపిఓ, మత్స్య శాఖ, డిపిఓ, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు, మాస్టర్ ట్రైనర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూపార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ విధులు నిర్వహించనున్న పిఓలు, ఎపిఓలకు 4, 6 తేదీల్లో శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విధులు కేటాయించిన సిబ్బంది అందరు శిక్షణకు హాజరయ్యేలా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శిక్షణా కార్యక్రమాలకు హాజరు కాలేని వారికి ఎలాంటి మినహాయింపు లేదని, తప్పని సరిగా హాజరు కావాలని పేర్కొన్నారు. శిక్షణకు విచ్చేయు సిబ్బంది ఉదయం 10 గంటల వరకు ఆయా కేంద్రాలకు చేరుకుని హాజరు ఫారంలో సంతకం చేయాలని, ఉదయం, సాయంత్రం రెండు విడతల హాజరు తీసుకోవాలని, గైర్హాజరైన సిబ్బంది జాబితా అందచేయాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మాంటిసోరి హై స్కూల్ లో శిక్షణా కేంద్రాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోనే శిక్షణా కేంద్రాలు ఉన్నందున సిబ్బంది క్రమశిక్షణ పాటించి నిర్దేశిత సమయంలోగా చేరుకోవాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి అనుమతి లేకుండా ఎవరైనా శిక్షణ కార్యక్రమాలకు గైర్హాజరైతే ఎన్నికల సంఘం నిబంధనల మేరకు క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. పీఓ, ఎపివోలకు పోస్టల్ బ్యాలెట్ జారీ చేసేందుకు ఫారం 12, విధులు కేటాయించిన ఉత్తర్వులు ప్రతి, ఎన్నికల సంఘం గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు)తో పాటు ఫారం 12 నందు ఓటు హక్కు కలిగిన పార్లమెంట్, శాసనసభ నియోజకవర్గాలు, పోలింగ్ స్టేషన్ నంబర్, ఓటరు జాబితాలోని క్రమసంఖ్య సక్రమంగా నమోదులు చేయాలని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో సిబ్బంది మేనేజ్మెంట్ నోడల్ అధికారులు శామ్యూల్, అవినాష్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి నారాయణరావు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడీవోలు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన జెడ్పీటీసీ సాగర్



**చిట్యాల ఏప్రిల్ 3 (జనంసాక్షి)** మండల కేంద్రము వాస్తవ్యులు కొక్కుల రమ-రమేష్ కుమారుడు రాకేష్ వెడ్స్ పూజిత, జడల్ పేట గ్రామ వాస్తవ్యులు ఇంచర్ల రాములు కవిత కుమార్తె ప్రాజ్ఞ వెడ్స్ ప్రవీణ్ వివాహ వేడుకకు జెడ్పిటిసి గొర్రె సాగర్ హాజరై నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో జీవించాలని నూతన దంపతులను ఆశీర్వదించారు.వారి వెంట పాంద్రాల వీరస్వామి, కందుల రమేష్, లాండే శివాజీ, భయగాని శ్రీధర్, రవీందర్, గణపతి, మెరుగు కృష్ణ ,జంగ మధుకర్, మొగిలి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గట్టమ్మ తల్లి హుండీ లెక్కింపు

## మొత్తం హుండీ ఆదాయం 42,225 రూ.లు



**ములుగు ప్రతినిధి, ఏప్రిల్03 (జనం సాక్షి):-** బుధవారం రోజు న ఆదివాసీ నాయకపోడ్ గట్టమ్మ దేవాలయం లో హుండీ లెక్కింపు మధ్యాహ్నం 2గంటలకు ఆది వాసీ నాయకపోడ్ గట్టమ్మ పూజ రుల ఆధ్వర్యంలో మరియు గట్టమ్మ ఆలయ నిర్వహణ అధికా రుల ఆధ్వర్యంలో హుండీ విప్పి లెక్కించగా నోట్లు రూ.39,070 లు,నాణెములు రూ.3155 లు మొత్తం రూ.42,225 లుగా వచ్చినవి. మరియు బంగారం,వెండి మరియు విదేశీ కారన్సీ లు ఏమి రాలేదు.ఈ కార్యక్రమములో దేవాదాయ శాఖ పరిశీలకులు, పరకాల విభాగం డి.అనిల్ కుమార్, ఆలయ కార్యనిర్వాహణాధికారి బి.శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది మరియు ఆదివాసీ నాయకపోడ్ గట్టమ్మ పూజర్లు కొత్త సదయ్య,కె.లక్ష్మయ్య, కె.సురేందర్,ఎ.రవి,చిర్ర సుభద్ర,ఆకుల లక్ష్మి,అచ్చ రాజు మరియు భక్తులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలుగా డి.సుమ ఎన్నిక




**దేవరుప్పుల,ఏప్రిల్ 03(జనం సాక్షి):** స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా ఉపాధ్యక్షురాలుగా దాసగాని సుమ ను ఏకగ్రీవంగా నియమిస్తున్నట్లు జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మబిక్షం తెలిపారు .జిల్లా కేంద్రంలోని ఏకశిలా డిగ్రీ కళాశాలలో జరిగిన ఎస్ఎఫ్ఐ మూడవ మహాసభ బుధవారం నిర్వహించారు .ఈ సందర్భంగా మండలంలోని రామరాజుపల్లి గ్రామానికి చెందిన దాసగాని సుమను ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.జిల్లా కమిటీ 19 సభ్యులను ఎన్నుకొని భవిష్యత్ కర్తవ్యాలపై తీర్మానాలు చేశామని ఆయన అన్నారు.జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని,ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఏర్పాటు చేయాలని,అదే విధంగా పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని తీర్మానం చేశామని అన్నారు .అనంతరం ఉమ మాట్లాడుతూ విద్యా రంగ సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని,తమ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

# ఎండాకాలం దృష్ట్యా చలివేంద్రం ప్రారంభం



**నేరడిగొండ ఏప్రిల్3(జన ంసాక్షి)** ప్రజలకు ఎండాకాలంలో ఒక్క పూట తిండి లేకున్నా సరేగాని త్రాగడానికి మంచి నీరు ఎంతో అవసరమని తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నా రు.బుధవారం రోజున మండల కేంద్రంలో సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తెలంగాణ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి బలరాం జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాబ్లే సంతోష్ సింగ్ సమాజసేవలో ఎల్లప్పుడూ ముందుంటారని, ప్రతీ సంవత్సరం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి మండలానికి వచ్చే వారి దాహార్తిని తీర్చడం అభినందనీయమని అన్నారు.ప్రజలకు వేసవికాలంలో ఒక్కపూట తిండి లేకున్నా సరేగాని త్రాగడానికి మంచి నీరు ఎంతో అవసరమని,ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# భా జ పా పట్టణ కమిటీ నియామకం



**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 3, (జనంసాక్షి) :**భార తీయ జనతా పార్టీ క్యాతన్ పల్లి మున్సి పాలిటీ పట్టణ కమిటీ నియామకం జిల్లా అధ్య క్షులు ఎర్రబెల్లి రఘునాథ్ ఆదేశాల మేరకు పట్టణ కమిటీ, వివిధ మోర్చాల కమిటీలను బిజెపి పట్ట ణ అధ్యక్షులు వేములఅశోక్ ఆధ్వర్యంలో బుధవారం నియమించారు. బిజెపి పట్టణ ప్రధానకార్యదర్శులుగా కట్టఈశ్వర చారి, మాసు సత్యనారాయణ, పట్టణ ఉపాధ్యక్షులుగావైద్య శ్రీనివాస్, ముద్దసాని శ్రీనివాస్,వీరమల్లరాజయ్య, పట్టణ కార్యదర్శులుగా జీడి ప్రభాకర్,పాకాల ప్రభాకర్ లను నియమించారు.బీజేవైఎం పట్టణ అధ్యక్షులుగా కున్సోత్ సంతోష్ రామ్, పట్టణ ఎస్సీ మోర్చా అధ్యక్షునిగా బంగారిప్రసాద్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలుగా పాకాల శ్రీలత, కిషన్ మోర్చా పట్టణ అధ్యక్షులుగా గజ్జలవెంకన్న లనునియమించినట్లు తెలిపారు.నూతనంగా నియమించబడిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీనీ అన్నివేళలా ముందుండి నడిపిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలోబిజెపి కేంద్ర ఫిలిం బోర్డ్ సభ్యులు ఆర్ముళ్ల పోషం,సీనియర్ నాయకులు బంగారు వేణుగోపాల్, ఠాగూర్ దన్సింగ్, దందురాజేందర్, మహిళా మోర్చా జిల్లా నాయకురాలు వేముల సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

# శభాష్ చైర్మన్ సాబ్



**ఖానాపూర్ ఏప్రిల్ 03 (జనంసాక్షి)**వేసవి ఆరంభం నుండి డబల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో నీటి కొరత ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో పలుమార్లు కాలనీవాసులు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి మొరపెట్టుకున్నారు. స్పందించిన చైర్మన్ రాజురా సత్యం ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సహకారంతో వారి దాహార్తిని తీర్చి శభాష్ అనిపించుకున్నారు. బుధవారం ఇక్బాల్ పూర్ గ్రామానికి వెళుతున్న మిషన్ భగీరథ పైప్ లైన్ నుండి డబల్ బెడ్ రూమ్ ఇళ్లకు ప్రత్యేక పైప్ లైన్ ద్వారా నీటిని మళ్లించారు. డబల్ బెడ్ రూమ్ కాలనీవాసుల నీటి సమస్యను తీర్చిన చైర్మన్ ను శభాష్ చైర్మన్ సాబ్.... అంటూ కాలనీవాసులు అభినందనల వర్షం కురిపించారు. నీటిని ప్రారంభించిన వారిలో చైర్మన్ తో పాటు కౌన్సిలర్ కిషోర్ నాయక్, నాయకులు జన్నారపు శంకర్, పరిమి సురేష్, షబ్బీర్ పాషా, తదితరులు ఉన్నారు.

# స్కూళ్లు ప్రారంభించే నాటికి కొత్తదనం కనిపించాలి

## సెలవుల్లో మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా బ్యూరో, (జనంసాక్షి):**స్కూళ్లు ప్రారంభించే నాటికి కొత్తదనం కనిపించాలని, సెలవుల్లో మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా కోరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్ర ంలోని కలెక్టర్ కార్యాలయ సమావేశపు హాలులో బుధవారం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఏకరూప దుస్తులు (యూనిఫామ్స్) కుట్టుట, మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మత్తులు, విద్యుత్ సౌకర్యం తదితర అంశాలపై ఎంపిడిఓలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఏపిఎంలు, జిల్లా, మండల మహిళా సమాఖ్యల అధ్యక్ష, కార్యదర్శులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురువారం మండలస్థాయిలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, ఇంజనీరింగ్, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఏపిఎంలు, మహిళా సమాఖ్యల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహించి పాఠశాలల్లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు కల్పనపై సమావేశం నిర్వహించాలని కోరారు. ప్రతి పాఠశాలను పరిశీలించి చేపట్టాల్సిన పనులకు అంచనా ప్రతిపాదనలు తయారు చేసి వారంలో నివేదికలు అందజేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్, మంచినీరు, మరుగుదొడ్లు, మరమ్మత్తులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించి పాఠశాలలను సుందరంగా, ఆహ్లాదకరంగా తయారు చేయాలని తెలిపారు. గ్రామంలోని మహిళా సంఘాల ద్వారా విద్యార్థులకు ఏకరూప దుస్తులు (యూనిఫామ్స్) కుట్టించాలని అన్నారు. పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిసరాలు పరిశుభ్రం చేసి ఆహ్లాదకరంగా తయారు చేయాలని తెలిపారు. పాఠశాలల్లో మురుగునీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి నిల్వలు లేకుండా పరిశుభ్రం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 450 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, వాటిలో 149 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని, మిగిలిన 301 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మౌలిక సదుపాయాలు కల్పనకు పనులు చేపట్టాలని తెలిపారు. చేపట్టనున్న పనులకు మూడు దశల్లో ఫోటోలు తీయా లని అవి పనులు ప్రారంభం సమయంలో, పనులు జరుగుతున్న సమయంలోను, పూర్తి అయిన పనుల ఫోటోలతో డాక్యుమెంట్ తయారు చేయాలని తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ ఇద్దరి పేరున సంయుక్తంగా బ్యాంకు ఖాతా ప్రారంభించాలని నిధులు అట్టి బ్యాంక్ ఖాతాలో జమచేయనున్నట్లు తెలిపారు. ఖర్చు చేస్తున్న ప్రతి పైసాను తప్పక రిజిస్టర్ లో వ్రాయాలని తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదించిన అంచనాల ప్రకారం తక్షణమే పనులు చేపట్టేందుకు 25 శాతం నిధులు ముందస్తు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన బోధన చేసేందుకు చేపట్టిన ఈ మౌలిక సదుపాయాల కల్పన పనులు ఒక బృహత్తర కార్యక్రమమని, ఇన్నోవేషన్ ఆలోచనతో ప్రతి మండలంలో రెండు ఆదర్శ పాఠశాలలను తయారు చేయాలని తెలిపారు. సమస్యల వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి ఇబ్బందులు లేకుండా పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 13వ తేదీ నుండి పనులు ప్రారంభం కావాలని, పనుల్లో నాణ్యత పర్యవేక్షణ భాధ్యత మహిళా స్వయం సహాయక సంఘాలదేనని, చాలా ప్రధానమైన పాత్ర ఉందన్నారు. ప్రతి తరగతి గదిలో లైట్లు, ఫ్యాన్లు ఉండాలని తెలిపారు. పనుల పర్యవేక్షణ బాధ్యతలు పంచాయతి రాజ్ ఇంజినీరింగ్ శాఖకు 7 మండలాలు, గిరిజన ఇంజినీరింగ్ సంక్షేమ శాఖకు 1, అదేవిధంగా టీఎస్ ఈడబ్ల్యూఐడిసి శాఖకు 3 చొప్పున కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో విజయలక్ష్మి, డిఆర్ డిఓ నరేష్, జిల్లా విద్యాశాఖ అధికారి డిపిఓ నారాయణరావు, సెక్టోరల్ అధికారి కిషన్ రావుతో పాటు మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, జల మహిళా సమాక్య అధ్యక్ష కార్యదర్శులు బందారి మంజుల, స్వరూప, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఏపీఎంలు పాల్గొన్నారు.

# పొన్నం ప్రభాకర్ మంత్రిగా రాజీనామా చేసి ఎంపీ గా బండి సంజాయ్ మీద పోటీ చెయ్యాండి

## రైతుల గురించి మొసలి కన్నీరు కారుస్తున్నా మంత్రి పొన్నం ప్రభాకర్

## బిజెపి మండల అధ్యక్షులుపైడిపెల్లి పృథ్విరాజ్ గౌడ్



**భీమదేవరపల్లిఏప్రిల్03(జనం సాక్షి)** ప్రతిసారి కరీంనగర్ ఎంపీ బండి సంజాయ్ మీద ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం అని బిజెపి మండల అధ్యక్షులు పైడపల్లి పృథ్వీరాజ్ గౌడ్ పేర్కొన్నారు. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో రైతంగాన్ని ఆగం చేస్తూ. రైతులను పట్టించుకోని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం.200000 లక్షల రుణమాఫీ ఏటుపోయింది అన్నారు. 500 బోనస్ ఎప్పుడు ప్రకటిస్తారు. రేవంత్ రెడ్డి ఎలక్షన్స్ ముందు ఏమన్నారో గుర్తు తెచ్చుకోండి లేదంటే రేవంత్ రెడ్డి ది నాలుక నా తాటిమట్టానా మీరే చెప్పాలి అన్నారు. తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్. నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ అంటే తెలుసా పొన్నం ప్రభాకర్ తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ లో ఇప్పటి వరకు కనీసం ఒక పల్లి విత్తనం టమోటో విత్తనం బబ్బేర. మినుములు. విత్తనాలు ఇచ్చిండ్రా. తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ లో రైతులకు ఇచ్చిండ్రా నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా పక్క రాష్ట్రాలల్లో ఎంఎస్పి ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు ఇస్తూ మద్దతు ధర ను ముందుగానే నిర్ణ యిస్తారు అని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర రైతులు ఎం పాపం చేసిండ్రో మీరు చెప్పా లి. మీకు దమ్ముంటే మంత్రిగా రాజీనామా చేసి బండి సంజాయ్ మీద ఎంపీ గా పోటీ చెయ్యాలి. గౌరెల్లి ప్రాజెక్ట్ నీళ్లు వదిలి రైతులను ఆదుకొని హుస్నాబాద్ ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా ఓబీసీ మోర్చా వేణు,అయిత సాయి,బొజ్జపురి పృథ్వి,భైరవోణి అనిల్,మాడ్గుల అజిత్, రమేష్,అనిల్ తదితరులు పాల్గొన్నారు

# నాగిరెడ్డిపల్లి లో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు



**బచ్చన్నపేట ఏప్రిల్ 3 ( జనం సాక్షి)**బచ్చన్నపేట మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో తెలంగాణ భగత్ సింగ్. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు . భూమికోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం పోరాడిన వీరుడు దొడ్డి కొమరయ్య 97వ జయంతి వేడుకలను గ్రామంలోని కురువ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన చేసినటువంటి పనులను కొనియాడారు. ఈ కార్యక్రమం లో కురువ సంఘం పెద్దలు. యువకులు. గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# మోడల్ స్కూల్స్ గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ శిక్త పట్నాయక్




**వరంగల్ బ్యూరో, ఏప్రిల్ 03 (జనం సాక్షి)** ప్రతి మండలంలో పాఠశాలలను మోడల్ స్కూల్స్ గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు-ఆరోగ్య ఉప కేంద్రాలు, గ్రామాల్లో తాగునీటి సరఫరా కి సంబంధించిన యాక్షన్ ప్లాన్, ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన, పోలింగ్ కేంద్రాలలో కనీస సదుపాయాల కల్పనపై జిల్లాలోని మండలాల ప్రత్యేక అధికారులు, ఎంఈఓ లు, ఇంజనీరింగ్ అధికారులు, పలు మహిళా సమైక్య అధ్యక్షులతో సమీక్ష సమావేశం బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రణాళికతో మౌలిక వసతుల సదుపాయాల ను కృషి చేయాలన్నారు. పాఠశాలల్లో ముందుగా మైనర్ రిపేర్లని పూరి చేయాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో ఒక్కో పనిని పూర్తిచేస్తూ మే నెల నాటికి అన్ని పనులను పూర్తిచేయాలని సూచించారు. ప్రతి పాఠశాలను మోడల్ గా తీర్చిదిద్దాలన్నారు. పాఠశాలల్లో బాలికల కోసం టాయిలెట్ల నిర్మాణం, మరమ్మతు పనులను పూర్తి చేయాలన్నారు. మహిళా సమాఖ్య గ్రూప్ అధ్యక్షులు పాఠశాలలను పరిశీలించి వాటికి కావాల్సిన పనులను మొదలుపెట్టాలన్నారు. ఏ ఏ సమస్యలు ఉన్నాయో వాటిని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని మహిళా సమాఖ్య అధ్యక్షులకు తెలియజేశారు. అర్బన్ ప్రాంతంలో అధికారులు ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. గతంలో పలు పాఠశాలల్లో పనుల నిమిత్తం మన ఊరు మనబడి కార్యక్రమం కింద మంజూరు చేయడం జరిగిందని, పూర్తి అయిన పనులను వదిలిపెట్టి మిగతా పనులను పూర్తి చేయాలన్నారు. మంజూరైన నిధులతో తప్పనిసరిగా చేపట్టాల్సిన పనులను పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో ఏయే పనులను పూర్తిచేయాలో ఇంజనీరింగ్, ఎంపీడీవో, ఎంఈఓ, ఇతర అధికారులు సమన్వయంతో పనులను పూర్తి చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి. జిల్లాలోని అన్ని మండలాల్లో మిగిలిన చోట్లా ధాన్యం కొనుగోలు కేంద్రాలను నాలుగో తేదీన తప్పకుండా ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. అదేవిధంగా పాఠశాలల్లో కేటాయించిన పోలింగ్ కేంద్రాలలో విద్యుత్తు, తాగునీరు, టాయిలెట్స్, ర్యాంపు, ఇతర కనీస సదుపాయాలు ఉండే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఏ పోలింగ్ కేంద్రంలోనూ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. వేసవికాలం దృష్ట్యా తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఏవైనా మరమ్మతు పనులు ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వేసవికాలం దృష్ట్యా ఈజీఎస్ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లతోపాటు అవసరమైన మందులు ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్ రెడ్డి, డిఈవో డాక్టర్ అబ్దుల్ హై, జడ్పీ సీఈవో విద్యాలత, డీఆర్డీవో నాగ పద్మజ, డిపిఓ లక్ష్మీ రమాకాంత్, మిషన్ భగీరథ ఈఈ మల్లేశం, మెప్మా పీడీ భద్రునాయక్, డిఎంహెచ్వో డాక్టర్ సాంబశివరావు, బీసీ వెల్ఫేర్ డిడి రామ్ రెడ్డి, డీఎస్ఓ వసంతలక్ష్మి, ఇతర అధికారులు, పలు మహిళా సమాఖ్య గ్రూప్ అధ్యక్షురాల్లు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల నియంత్రణ పై అవగాహన సదస్సు




**ములుగు ప్రతినిధి,ఏప్రిల్03(జనంసాక్షి):-**సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ విభాగం వారి సూచన మేరకు ప్రతినెల మొదటి బుధవారం రోజున సైబర్ జాగంరూకత దివాస్ నిర్వహించబడుతుంది. ఇందులో భాగంగా బుధవారం రోజున ములుగు మండల పరిధిలోని గవర్నమెంట్ హాస్పిటల్ లో సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ ఎం.సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా డిఎస్పీ మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్ అనేవి ఈ రోజుల్లో చాలా పెరిగిపోయాయి. సైబర్ క్రైమ్ నియంత్రణలో భాగంగా ఏ విధమైన ఓటీపీలు గాని లింకులు గాని ఓపెన్ చేయకూడదు మరియు ఎవరైనా కాల్ చేసి లేదా మెసేజ్ పంపి ఓటిపి అడగడం గానీ లింక్స్ పంపి ఓపెన్ చేయమంటే ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయకూడదు. వాట్సాప్ లో గాని టెలిగ్రామ్ లో గాని పార్ట్ టైం జాబ్స్ పేరుతో మెసేజ్ చేసి లేదా కాల్స్ చేసి టైం జాబ్స్ చేయమంటే వాటిని కూడా నమ్మకూడదు అని అమౌంట్ కట్టించుకుని ఆ తరువాత వాటిని తిరిగి ఇవ్వకుండా మీ దగ్గర ఉన్న ఇంకా డబ్బులు లాగే ప్రయత్నం చేస్తారు. అలాగే తమ సోషల్ మీడియా అకౌంట్లను టూ స్టెప్ వెరిఫికేషన్ ద్వారా సెక్యూర్ గా పెట్టుకోవచ్చు అని తెలియజే శారు. అలాగే ఈ రోజుల్లో జరుగుతున్న హెూటల్ బుకింగ్స్ స్కాం, ఇన్వెస్ట్మెంట్స్ స్కాం, ఇంపర్సనేషన్ స్కామ్స్ వీటన్నిటి మీద అవగాహన కల్పించారు వీరితో పాటు ములుగు సీఐ రంజిత్, సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ యాసీన్, ములుగు ఎస్ఐ వెంకటేశ్వర్లు మరియు సైబర్ క్రైమ్ సిబ్బంది జహురుద్దీన్, శ్రీకాంత్, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

# యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన డీపీఎం నలిని



**పెద్దవంగర ఏప్రిల్ 03(జనం సాక్షి )** యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐకెపి డీపీఎం నలిని అన్నారు. బుధవారం మండలంలో ఐకెపి ఆధ్వర్యంలో బొమ్మకల్ భవాని ,బీసీ తండా, వడ్డేకొత్తపల్లి సాయిబాబా, ఉప్పరగూడెం కోరిపల్లి గ్రామాలలో శ్రీ వెంకటేశ్వర ధాన్యం కొనుగోలు సెంటర్లను ఐకెపి డీపీఎం నలిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. తెలంగాణ ప్రభుత్వం మద్దతు ధర ఏ గ్రేడ్ రూపాయలు 2203 , సాధారణ రకం రూపాయలు 2183 ప్రభుత్వం కేటాయించింది తేమ శాతం 17 ఉండాలని రైతులకు తెలిపారు. రైతులకు ఎప్పటికప్పుడు అధికారులు అందుబాటులో ఉండాలని రైతులకు ఎలాంటి ఇబ్బంది కలవకుండా చూడాలని అధికారులకు సూచనలు ఇచ్చారు. వాటర్ సౌకర్యం, హమాలీలు కొరత లేకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐకెపి సిసి సుధాకర్, ఆపరేటర్ అనిల్, రైతులు, సోమనరసింహారెడ్డి, మల్లికార్జున చారి, పొడిశెట్టి సైదులు,బిసు హరికృష్ణ, శ్రీనివాస్, వెంకన్న, మల్లయ్య, వివో లు, మహిళా సంఘం సభ్యులు, హమాలి తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీ ద్వారానే అభివృద్ధి సాధ్యం



**స్టేషన్ ఘన్ పూర్ , ఏప్రిల్ 03 , ( జనం సాక్షి ) :**కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ కృష్ణాజి గూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు సాదం రాజేందర్ అన్నారు. చిల్పూర్ మండలంలోని కృష్ణాజి గూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో సాదం రాజేందర్ మాట్లాడుతూ 10 సంవత్సరా లు అధికారంలో ఉండి ఏమీ అభివృద్ధి చేయని టిఆర్ ఎస్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఫామ్ హౌస్ లో ఉండి ఏ ఒక్కరోజు రైతులను పట్టించుకోని కెసిఆర్ పోగానే పంట పొలాలను పరిశీలించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం 6 గ్యారంటీలు అమలు చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బిఆర్ఎస్ నాయకులు ఏంమాట్లాడాలో అర్థంకాక మతిభ్రమించి మాట్లాడుతు న్నారని అన్నారు. తెలంగాణరాష్ట్రంలో గతంలో కాంగ్రెస్ పార్టీకిచెందిన ఎంఎల్ఏలు టీఆర్ఎస్ ప్రభుత్వంలోకి వెళ్లినప్పుడు ఆనాడు ఏం మాట్లాడిన టిఆర్ఎస్ నాయకులు ఈరోజు కాంగ్రెస్ అభివృద్ధిని చూసి కాంగ్రెస్ లోకి వస్తున్న వారిని చూసి రాజీనామా లు చేసి వెళ్లాలని సిగ్గుచేటు అన్నారు. మల్లన్న గండి ఎడమ కాలువ మంజూరై 10 సంవత్సరాలు అయినా పంటలు ఎండిపోయిన పట్టించుకోని కేసీఆర్, కేటీఆర్ ఈరోజు సాగునీటి గురించి మాట్లాడం సరైంది కాదన్నా రు. కేంద్రంలో మళ్లీ బిజెపి పార్టీ అధికారంలోకి వస్తే మతతత్వం పెరిగిపోతుందని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుం దని అన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని పార్లమెం టు:స్థానాలను కాంగ్రెస్ ను గెలిపించుకోవాల్సిన అవస రం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డమీద సురేష్, పుట్ట కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు రెండు లక్షల రుణ మాఫీ వెంటనే మాఫీ చేయాలి రావుల రాంనాథ్



**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్03, జనంసాక్షి,,** సోన్ మండలం పాక్ పట్ల గ్రామంలో జరిగిన విలేకరుల సమావేశంలో బిజెపి రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ మాట్లాడుతూ రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, ఉమ్మడి ఆది లాబాద్ జిల్లాలో పంటలు ఎండిపోయి రైతులకు నష్టం జరిగితే ఇప్పటికీ ఎటువంటి నష్టపరిహారం చెల్లించకుండా రైతులను మోసం చేస్తున్నదని అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి ఇప్పటికీ ఒక సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ ప్రభుత్వం పై మండి పడ్డారు. పంట నష్ట పోయి అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే వారిని పరిష్కరించడంలో కాంగ్రెస్ ,బిఆరెస్ పార్టీలు విఫలమయ్యారని అన్నారు. అందుకే బిజెపి రైతుల పక్షాన ఈనెల 5వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో రైతు సత్యాగ్రహాలు నిర్వహించడం జరుగుతుంది ఉదయం 10 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ సత్యాగ్రహం చేయడం జరుగుతుందని, 25 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని,రుణ మాఫీ చేయాలని ఎకరానికి రైతుకు 15 వేల రూపాయలు కౌలు రైతుకు 12000 రూపాయలు చెల్లించాలని బిజెపి డిమాండ్ చేశారు..ఈ విలేకరుల సమావేశంలో నాయకులు మార గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలి

## మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్




**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్03,జనంసాక్షి,** ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయా లని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. బుధవారం సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ , శ్రీ గ్రీన్ వర్క్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకాలపై జరిగే అనర్థా లపై జిల్లా కేంద్రంలోని పురపాలక సం ఘం కార్యాలయంలో ఢిల్లి నుండి విచ్చేసి నవిద్యా ర్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ తో పర్యావరణానికి పెనుమొప్పు వాటితో ప్రమాదం ఉందని ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని కోరారు. పట్టణంలోని కమర్షియల్ షాపింగ్ మాల్స్ , వ్యాపారస్తులకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, దారంతో నేసినవి,సంచి వంటివి ఉపయోగించాలని కోరారు. గత ఐయిదు రోజులు గా జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళిల్లో ప్లాస్టిక్ వాడకాల పైజరిగేఅనర్థాల గూర్చి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. కమిషనర్ సి.వి.ఎన్ రాజు,టి.పి.ఎస్ నవీన్,టి.పి.ఓ సుమలత, సాజిటరీ ఇన్స్పెక్టర్ దేవిదాస్,కౌన్సిలర్లు ,తదితరులు పాల్గొన్నారు.

# అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

## ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్



**ఖానాపూర్ ఏప్రిల్ 03 (జనంసాక్షి)**రానున్న పార్లమెంటు ఎన్నికల బరిలో నిలిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే బుజ్జి పటేల్ పిలుపునిచ్చారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో చేరికల సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని అన్నారు. పి ఎస్ ఎస్ ఖానాపూర్ శాఖ చైర్మన్ ఇప్ప సత్యనారాయణ రెడ్డి తో పాటు పదిమంది డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే పలువురు బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు చెందినవారు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరినీ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీ తప్పకుండా నెరవేరుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చెప్పిందే చేస్తుందన్నారు. నిరుపేదల బతుకులు బాగుపడాలంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోకి రావాలన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాలనే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త పనిచేసి ఆత్రం సుగుణను గెలిపించి రాహుల్ గాంధీకి బహుమతిగా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు దొరికేని దయానంద్, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, సుర్జాపూర్ ఎంపీటీసీ జంగిలి శంకర్, మాజీ వైస్ ఎంపీపీ తోట సత్యం, మాజీ సర్పంచ్ లు నేరెళ్ల సత్యనారాయణ, సుతారి రాజేశ్వర్, నాయకులు మైస శ్రీనివాస్, శౌకత్ పాషా, సార్ల నరసయ్య, జహీర్, రాజేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి ప్రతీక రంజాన్

## జమా మసిద్ లో ఇస్తార్ విందు

### భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు దండు రమేష్



**మల్హర్,ఏప్రిల్ 03(జనంసాక్షి)** మత ఓసామరస్యానికి ప్రతీక రంజాన్ అని భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడు దండు రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బడితేల రాజయ్య అన్నారు. పవిత్ర రంజన్ మాసం పురస్కరించుకుని, తెలంగాణ రాష్ట్ర ఐటి,పరిశ్రమలు,శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు మండల కేంద్రమైన తాడిచెర్లలో బుధవారం జమా మసిద్ లో ముస్లిం సోదరులకు ఇస్తార్ విందును నిర్వహించడం జరిగిందన్నార ు.ముస్లిం సోదరులకు రంజాన్ మాసం పవిత్ర మాసం అన్నారు.నెలరోజులపాటు కఠిన ఉపవాస దీక్షలు చేస్తారన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బడితేల రాజయ్య, నాయకుల ు అశోక్‌రావు, రాహుల్, ఆంజనేయులు,లింగయ్య,సది,శ్రీనివాస్.సత్యనారాయణ, ముస్లిం సోదరులు అజ్మట్ అలీ,అంకుష్‌మియా,రహమాన్,మైవెల్లి, మొగులాబ్ సబ్,రజ్జు,చోట,రాజమహ్మద్ పాల్గొన్నారు.

# బైక్ యాక్సిడెంట్లో గాయాలపాలైన డాక్టర్ రంజిత్



**ములుగు ప్రతినిధి,ఏప్రిల్03 (జనంసాక్షి):** -ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని కాటాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యొక్క వైద్యాధికారి డాక్టర్ రంజిత్ విధులు నిర్వర్తించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కు వెళ్తున్న సందర్భంలో పసర నుండి తాడ్వాయి మార్గమధ్యంలో అకస్మాత్తుగా తను నడుపుతున్న బైక్ మొండియాల తోపు జలగలవంచ పాయింట్ దగ్గర యాక్సిడెంట్ అయింది .డాక్టర్ రంజిత్ కి తలకు గాయంతో పాటు కుడి చేయి బలమైన గాయాలు తగిలాయి ప్రస్తుతం వారు చికిత్స తీసుకుంటున్నారు. హన్మకొండ ఆసుపత్రిలో చేతికి సర్జరీ ఆర్థోపెడిక్ సర్జన్ చేయడం జరిగింది .విషయం తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రంజిత్ ను పరమర్శించారు.తను త్వరగా కోలుకోవాలని తిరిగి పూర్వపు ఆరోగ్య స్థితికి రావాలని కోరారు.వైద్యాధికారి డాక్టర్ రంజిత్ త్వరగా కోలుకోవాలని కాటాపూర్ వైద్య సిబ్బంది మరియు తాడ్వాయి వైద్య సిబ్బంది వైద్యాధికారులు కోరుకుంటున్నారు.

# సైబర్ నేరాల నియంత్రణకు పాటు పడాలి

## జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా బ్యూరో, (జనంసాక్షి):**సైబర్ నేరాల నియంత్రణకు సైబర్ క్రైం పోలీసులు పాటు పడాలని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే కోరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని పోలీసు కార్యాలయంలో నూతన%శీ%గా సైబర్ క్రైమ్ డిఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎన్.సుభాష్ బాబు బుధవారం ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూపె రిగిపోతున్న సాంకేతికతకు తగ్గట్టుగానే, సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీస్ శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, ప్రతి పోలీస్ స్టేషన్ లో ఒకరిని సైబర్ వారియర్ గా నియమించి వారికి మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు అందజేయడం జరిగిందని తెలిపారు. సైబర్ నేరాలను నియంత్రించడం, ప్రజలు సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అన్ని స్థాయిల పోలీస్ అధికారులు సైతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సైబర్ క్రైమ్స్ పట్ల మరింత అవగాహన కలిగివుండాలన్నారు. సైబర్ క్రైమ్ బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ లో సైబర్ సెక్యూరిటీ ప్రతినిధిని కేటాయించామని, సైబర్ నేరాల బారిన పడిన ప్రజలు వెంటనే 1930 కి కాల్ చేయడం గానీ, ఎన్ సీఆర్ పీ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. బాధితులు ఫిర్యాదులను నమోదు చేసుకుంటేనే గుర్తించడం సులువవుతుందని ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ బి, డీసీఆర్ బి ఇన్స్పెక్టర్లు వసంత్ కుమార్, రామకృష్ణ, సైబర్ సెల్ కో- ఆర్డినేటర్ స్వామి గౌడ్, పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి





**స్టేషన్ ఘన్పూర్ , ఏప్రిల్ 03 , ( జనం సాక్షి ) :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఉమాదేవి, ఏపీఎం కె కుమారస్వామి అన్నారు. మండలంలోని తాటికొండ మహెూదయ కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం కుమారస్వామి ప్రారంభించగా, కొత్తపెల్లి మహాలక్ష్మి కొనుగోలు కేంద్రాన్ని, శివునిపెల్లి నవ యుగ కొనుగోలు కేంద్రాన్ని, ఎంపీడీవో ఉమాదేవి, ఏపీఎం కుమారస్వామి ప్రారంభించారు. పామునూర్ నవతా కొనుగోలు కేంద్రాన్ని, తానేదార్పల్లి శ్రీ విఘ్నేశ్వర కొనుగోలు కేంద్రాన్ని, అక్కపెల్లి గూడెం శ్రీ హనుమాన్ కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం కుమార స్వామి కొబ్బరికా యలుకొట్టి వరిధాన్యం కొనుగోలుకేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొలుగోలు కేంద్రాలలోనే రైతులు పండించినధాన్యాన్ని అమ్ముకోవాలనిఅలాంటప్పుడే రైతులకు మద్దతు ధర లభిస్తుందని అన్నారు. చిల్లర కాంటాల వద్ద ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దని అన్నారు. నిర్వాహకులు కొనుగోలు కేంద్రాల వద్దకు వచ్చినరైతులకు మంచినీటి సౌకర్యం తదితరసౌకర్యా లు కల్పించాలని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ప్రేమయ్య, సిడిపిఓ ఫ్లోరెన్సీ, పంచాయతీ కార్యదర్శులు,ఏఈఓలు ప్రతిభ, ఈశ్వరి, దీపక్,మహిళా సంఘం సభ్యులు ఏ వసంత, పి రజిని, ఎం మనోహర, బి ప్రేమలత, వి అనిత, బి సుశీల, ఇందిరా, రజిత, శోభ, స్రవంతి, రమాదేవి, రజిత, శిల్పా, మనీలా, మౌనిక తదితర గ్రామాల మహిళా సంఘం సభ్యులు, సిఏలు, వివోఏలు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని సముద్రాల,రంగరాయిగూడెం,ఇప్పగూడెం,చిల్పూర్‌మండలంలోని పల్లగుట్ట,కృష్ణాజిగూడెం, పతేపూర్ గ్రామాలలో పీఏసిఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొను గోలు కేంద్రాలను సీఈఓ మొహమ్మద్ మగ్దుం అలీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రైవేటు కాంటాల వద్ద అమ్ముకోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద అమ్ముకోవడం ద్వారా మద్దతు ధర లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ సిబ్బంది సింగపురం రాజు,మాటూరి రాంప్ర సాద్, పిఏసిఎస్ సెంటర్ ఇంచార్జ్ లు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ గా తౌటిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి



**స్టేషన్ ఘన్పూర్, ఏప్రిల్ 03 , (జనం సాక్షి) :**సంస్థాగత నిర్మాణంలో భాగంగా భారతీయ జనతా పార్టీని అభివృద్ధి చేసే దిశలో భాగంగా మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన తౌటిరెడ్డి రాజేశ్వర్ రెడ్డిని నియోజకవర్గ ఐటి, సోషల్ మీడియా కన్వీనర్ గా నియమించడం జరిగిందని బిజెపిపార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడ్డి అన్నారు. ఈ సంద ర్భంగా తౌటి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి కి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడ్డి మాట్లాడుతూ ఈరోజు నుంచి పార్టీ అభివృద్ధి కోసం పూర్తి సమయాన్ని కేటాయిస్తూ స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గంలోని బూత్ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెడుతున్న పథకాలను సామాజిక మధ్యమాల ద్వారా రాజాల్లోకి తీసుకెళ్లాలని, బూత్ స్థాయి నుండి పార్టీ బలోపేతానికి కృషి చేయలని అన్నారు. తౌటి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుని ఆదేశానుసారం పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. తనకి అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షుడు ఆరోట్ల దశమంతరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.